క్లుప్తంగా

నాలుగు మండలాల్లో వర్షం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు నాలుగు మండలాల్లో వర్షం పడింది. తెనాలి మండలంలో 20.6 మిల్లీ మీటర్లు, వట్టిచెరుకూరు 14.4, చేబ్రోలు 3.2, దుగ్గిరాల మండలంలో 2.6 మి.మీ. చొప్పున వర్షం పడింది.

రోడ్డు ప్రమాదాలపై వినూత్న ప్రచారం



నెహ్రూనగర్: రోడ్డు ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగహన కలిగి ఉండాలని నగరపాలక సంస్థ హైస్కూల్‌లో పనిచేస్తున్న అటెండర్ తుమ్మేటీ అచ్చయ్య వాహనదారాలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం గుంటూరు నగరంలో హిందూ కాలేజీ సెంటర్ వద్ద ప్రత్యేకంగా తయారు చేసిన పోస్టర్ ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదం చావు అంచుల దాకా వెళ్లానని.. దేవుడి దయ వల్ల బతికినని చెప్పారు. అటువంటి పరిస్థితి ఎవరికి రాకూడదనే ఉద్దేశంతో వాహనదారులు వేగం తగ్గించి నడిపాలని, హెల్మెట్ ధరించాలని కోరుతూ ప్రచారం చేస్తూ వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నానని చెబుతున్నారు.

నేడు మల్లయ్య లింగం వర్ధంతి

లక్ష్మీపురం: సీపీఐ నాయకుడు దివంగత మల్లయ్య లింగం వర్ధంతి గురువారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నగర కార్యదర్శి కె.మాల్యాద్రి తెలిపారు. స్థానిక కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం మాట్లాడారు. కాకాని రోడ్డులోని మల్లయ్య లింగం స్థూపం వద్ద సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు జి.సురేష్ బాబు, నూతలపాటి చిన్న, రావుల అంజిబాబు, చిన్న పోతుల విజయ్ కుమార్, దేవా నాయక్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతి

నెహ్రూనగర్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో చిలకలూరిపేట ఎక్సైజ్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న చవల శ్రీనివాసరావు గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం ఉదయం స్టేషన్‌లో విధులకు హాజరైన శ్రీనివాసరావు(53) గుండె నొప్పి రావడంతో తోటి సిబ్బంది ఆయన్ను చిలకలూరిపేటలోని ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువచ్చారు..అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతి చెందిన విషయం తెలుసుకున్న వెంటనే డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణకుమారి, గుంటూరు నగరంలోని కోబాల్ట్‌పేట 8వ లైనులోని మృతుని ఇంటి వద్దకు వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మార్పు కోటయ్య పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

పట్నంబజారు: వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రగతి నగర్‌లో నివాసం ఉండే ఓర్సు పార్వతి(43) మహిళ సుమారు రూ.7 లక్షల వరకు అప్పులు చేసింది. అప్పుల బాధతో నాలురోజుల క్రితం ఎలుకల మందు తినగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. మృతురాలి కుమారుడు వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వైద్య ఉద్యోగి మృతి

గుంటూరు మెడికల్: పల్నాడు జిల్లా టీబీ విభాగంలో ఎంపీహెచ్ఎస్(మేల్) గా పని చేస్తున్న షేక్ నబీ సాహెబ్ (56) బుధవారం కన్ను మూశారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గుంటూరు బావాజీ నగర్ లోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఒక కుమారుడు, ఒక కుమార్తె. కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం పూర్తిగా ఆరోగ్యం క్షీణించి మంచానికే పరిమితం అయ్యారు. గత రెండు రోజులుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు. షేక్ నబీ సాహెబ్ భౌతిక కాయాన్ని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా సందర్శించి నివాళులర్పించారు.

అగస్త్యేశ్వరా... మన్నించు..

- పాతగుంటూరు ఆలయంలో భక్తులకు లేని ప్రాధాన్యం
- ఆలయ పరిస్థితులను పట్టించుకోని ఈవో, ఆలయ సిబ్బంది
- దేవదాయశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన భక్తులు



పాతగుంటూరు అగస్త్యేశ్వరస్వామి ఆలయం



ధ్వజస్తంభం వద్ద ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్

పట్నంబజారు: అగస్త్యేశ్వరస్వామి ప్రతిష్ఠించిన ఎంతో ప్రాశస్త్యం కలిగిన ఆలయం. వేలాది మంది భక్తుల మనోభావాల కొంగు బంగారమై విరాజిల్లే.. గంగాపార్వతి అమ్మవారు.. ఎంతో విశిష్టత కలిగిన ఆలయం.. ఎంతో ప్రాచుర్యం కలిగిన శ్రీ గంగా పార్వతి సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో భక్తుల మనోభావాలకు కనీసం ప్రాధాన్యం లేకుండా పోతోంది.

పర్యవేక్షణపై ఫిర్యాదు..

ఈ క్రమంలో ఒక భక్తుడు ఆలయంలో పరిస్థితులు చూసి ఓర్చుకోలేక జిల్లా కలెక్టర్, దేవదాయ ధర్మదాయ శాఖ డెప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌లకు కొత్తపేటకు చెందిన ఎల్.దుర్గాప్రసాద్ నాయుడు అధికారులకు ఫిర్యాదు చేశారు. అందులో ఆలయ ఉద్యోగులు సమయపాలన పాటించటంలేదని, గుడి ప్రాంగణం శుభ్రంగా ఉండటం లేదని, ఆలయం లోపల అరుగులపై కొంత మంది వ్యక్తులు కూర్చుని నిత్యం సినిమా, రాజకీయ ముచ్చట్లకు మండపం వేదికగా మారిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సాయంత్రం వేళల్లో ఆలయ అధికారులు, సిబ్బంది మచ్చుకైనా కనిపించడంలేదని ఫిర్యాదులో స్పష్టంగా పొందుపరిచారు. గుడి లోపల కొంత మంది చిన్నారులు వచ్చి నవగ్రహ మండపంలోని వస్తువులు చోరీకి పాల్పడుతున్న పట్టించుకోవడం లేదని వివరించారు. ఆలయ సెక్యూరిటీ గార్డును వృద్ధుడిని నియమించటం ద్వారా కనీసం అతను వారిని అదుపు చేయలేని పరిస్థితి ఏర్పడింది.

ధ్వజస్తంభానికి అడ్డు తీగలు...

ఏ ఆలయం అయినా.. ఆలయ ప్రవేశం అవ్వగానే తొలి ప్రాధాన్యమిచ్చేది ధ్వజస్తంభం నమస్కరించి, పసుపు, కుంకుమ సమర్పించటం సంప్రదాయం. కానీ అగస్త్యేశ్వర ఆలయంలో మాత్రం ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేయటంతో ఆఖరికి ధ్వజస్తంభానికి నమస్కరించలేని పరిస్థితులు ఉన్నాయి.

ఏళ్ల తరబడి పాతకుపోయిన సిబ్బంది...

ఆలయంలో పనిచేసే అటెండర్‌ల దగ్గర నుంచి కార్యనిర్వాహణాధికారులకు వరకు విధుల నిర్వహణ కాలపరిమితి అనేది ఏ శాఖలోనైనా ఉంటుంది. అయితే ఈ ఆలయంలో మాత్రం కొంత మంది సిబ్బంది ఏళ్ల తరబడి పాతకుపోయారు. అన్ని వార్లై అయి, ఆఖరికి అర్చకులు, తోటి సిబ్బంది, భక్తులను కూడా భయపెడుతున్న పరిస్థితులు ఉన్నాయనే ఆరోపణలు లేకపోలేదు. దీనికి తోడు ఆయా విశేష రోజుల్లో భక్తుల నుంచి తీసుకున్న వస్తువులను కూడా బయట విక్రయించుకుంటున్నానే వాదనలు వినవస్తున్నాయి. కనీసం భక్తులకు ఇవ్వాల్సిన ప్రాధాన్యం కూడా లేకుండా ఇష్టానూసారంగా నోరు పారేసుకుంటున్న పరిస్థితులు ఉన్నాయని తెలుస్తోంది.

గతంలో ఇదే విధంగా.....

అగస్త్యేశ్వర ఆలయంలో గతంలో కూడా అనేక చోరీలు జరిగిన పరిస్థితి ఉందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులను అడినప్పటికీ కనీసం తమకు తెలియదని తప్పుకుంటున్నారు. గతంలో ఆలయం ఎదుట పనిచేసే చెప్పుల స్టాండ్ వ్యక్తి వద్ద నుంచి సెల్‌ఫోన్, నగదు దోచుకుపోయారు. అదే క్రమంలో పలువురు భక్తుల ఇద్దరికి సంబంధించి సెల్‌ఫోన్‌లు, ఒక మహిళ హ్యాండ్ బ్యాగ్ పోయినప్పటికీ కనీసం పోలీసులకు ఫిర్యాదు కూడా చేయని పరిస్థితులు ఉన్నాయంటే.. ఆలయ అధికారుల నిర్వహణ ఇట్టే అర్థమవుతుంది. ఒక విద్యార్థి కళాశాల ఫీజును బ్యాగు పెట్టుకుని ఆలయానికి వచ్చి ప్రదక్షిణలు చేస్తున్న సమయంలో ఆ ఫీజు డబ్బులు అపహరించుకుపోయారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటువంటి ఘటనలు ఒకటికి పలుమార్లు ఇప్పటికీ పునరావృత్తం అవుతాన్నా.. ఆలయ అధికారులు పట్టించుకోవడం లేదు.

ఈఓపై ఆరోపణలు వస్తున్నాయి...



అగస్త్యేశ్వరస్వామి ఆలయ నిర్వాహణపై పలు ఆరోపణలు వస్తున్న మాట వాస్తవమే. ఆలయ ఈఓపైన పలు ఆరోపణలు వచ్చాయి. త్వరలోనే ఆలయాన్ని సందర్శించి, పూర్తి వాస్తవాలు తెలుసుకుని చర్యలు తీసుకుంటాం. భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యవహరిస్తే.. అధికారి అయినా, సిబ్బంది అయినా చర్యలు తప్పవు. కచ్చితంగా భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు, ఆలయ పరిశుభ్రత అధికారులదే బాధ్యత. త్వరలో చర్యలు తీసుకుంటాం.

–కేబీ శ్రీనివాసరావు, డీసీ, దేవదాయశాఖ

వలంటీర్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

వలంటీర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చైతన్య డిమాండ్



మాట్లాడుతున్న వలంటరీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జంగాల చైతన్య

లక్ష్మీపురం: వలంటర్ వ్యవస్థపై ప్రభుత్వం క్యాబినేట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని వలంటరీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జంగాల చైతన్య డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం రాకముందు వలంటీర్స్‌కు రూ.10 వేల వేతనం, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన వాగ్దానం నిలుపుకోవాలని కోరారు. దసరాకు మంచి వార్త చెప్పాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్స్ జిల్లా కన్వీనర్ ఓ రాజేష్, వెంకటరెడ్డి, అబ్దుల్ వజిత్, నాగరాజ్, రమేష్, నజీర్ బాబు, అరుణ్, గాయత్రి పాల్గొన్నారు.

వీఆర్‌కు ఎస్ఐ భాగ్యరాజు

పట్నంబజారు: ఈస్ట్ సబ్‌డివిజన్ పరిధిలోని పాతగుంటూరు పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్ఐ పి.భాగ్యరాజును వీఆర్‌కు పంపుతూ ఉన్నతాధికారులు బుధవారం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. పలు పరిపాలన కారణాల రీత్యా పిలిచినట్లు సమాచారం.

ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన



నెహ్రూనగర్:ఒడిశాలోని బాసుగై మున్సిపల్ కార్పొరేషన్‌లో ఒడిశా అర్బన్ అకాడమీలోని వికేంద్రీకృత ఘన వ్యర్థాల నిర్వహణ సెంటర్, మల వ్యర్థాల శుద్ధి కేంద్రాల పనితీరును, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణను అక్కడి అధికారులు నగర కమిషనర్ పులి శ్రీనివాసులకు వివరించారు. స్టడీ టూర్‌లో భాగంగా బుధవారం ఒడిశా రాష్ట్రంలో కమిషనర్ పర్యటించి అక్కడ అమలు జరుగుతున్న పలు విషయాలను తెలుసుకున్నారు.

మోటారు సైకిల్ దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వీరానాయక్, ముసుగులో నిందితుడు వెంకటేష్

లక్ష్మీపురం: మోటారు సైకిల్ చోరీకి పాల్పడుతున్న నిందితుడిని బుధవారం రాత్రి నగరంపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంపాలెం సీఐ వీరానాయక్ తెలిపిన వివరాలు.. ఈనెల 5వ తేదీన పోలీస్ స్టేషన్ పరిధిలో ఐటీసీలో ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వ్యక్తి రోజు మాదిరిగానే ఉదయం వాహనాన్ని పార్కింగ్ ప్రదేశంలో పెట్టారు. తిరిగి సాయంత్రం పని ముగించుకుని వచ్చి చూస్తే పార్కింగ్ ప్రదేశంలో వాహనం కనిపించలేదు. చుట్టు పక్కల పరిశీలించి అదే రోజు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వాహనాలు చోరీకి పాల్పడే వ్యక్తి కోసం సీఐ వీరానాయక్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. పోలీసుల దర్యాప్తులో ద్విచక్రవాహనాలను చోరీ చేసిన వ్యక్తి పలకలూరు రోడ్డులోని రత్నగిరి నగర్ ప్రాంతానికి చెందిన వెలుగోలు వెంకటేష్‌గా గుర్తించి బుధవారం వెంకటేష్‌ను ఎస్ఐ రామాంజనేయులు అదుపులో తీసుకుని అతని వద్ద ఉన్న మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి అరెస్ట్ చేసినట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అంకిరెడ్డిపాలేనికి చెందిన గుర్రాల మరియదాసు(59) ద్విచక్ర వాహనంపై వెళుతూ నల్లపాడు నుంచి అంకిరెడ్డిపాలెం వెళ్లే దారిలో సాయిబాబా గుడి దాటిన తరువాత రోడ్డుపక్కన ఆగి ఉన్న లారీని ఢీకొని రోడ్డుమీద పడడంతో వెనుకగా వస్తున్న కారు మరియదాసుపై నుంచి వెళ్లింది. దీంతో మరియదాసు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఘటనపై నల్లపాడు పోలీసులు రుద్ర ట్రస్టు సహాయంతో జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఘటనపై మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వంశీధర్ తెలిపారు.

నగరంలో విద్యుత్ శాఖ విజిలెన్స్ విస్తృత తనిఖీలు

కొరిటిపాడు(గుంటూరు): విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం గుంటూరు జిల్లా పర్యవేక్షక ఇంజినీర్ కె.వి.ఎల్.ఎన్.మూర్తి ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని కృష్ణనగర్, లక్ష్మీపురం, బృందావన్ గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 4,802 సర్వీసులు తనిఖీ చేశారు. అదనపు విద్యుత్ వాడుకుంటున్న ఇద్దరికి రూ.30 వేలు, అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న మరో 275 మందికి రూ.13.50 లక్షలు మొత్తం కలిపి రూ.13.80 లక్షలు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు సీహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ సర్వీసుల తనిఖీలు భారత విద్యుత్ చట్టంకు లోబడి ఉంటాయన్నారు. అపరాధ రుసుం కట్టలేని పరిస్థితుల్లో రెవెన్యూ రికవరి చట్టం ఉపయోగించి ఆస్తులు జప్తు చేయబడుతుందని చెప్పారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను పూర్తి వివరాలతో 9440812263, 9440812360 నంబర్లకు నేరుగా లేదా వాట్సప్ యాప్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. దాడుల్లో డీఈఈలు కె.రవికుమార్, ఎన్.గురవయ్య, ఏఈ జి.నాగరాజకుమార్ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ఆర్థిక చేయూత

మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్



మాట్లాడుతున్న మెప్మా డైరెక్టర్

నెహ్రూ నగర్: ప్రధాన మంత్రి స్వానిధి ద్వారా చిరు వ్యాపారులకు ఆర్థిక చేయూత అందిస్తుందని, గుంటూరు నగరంలోని వీధి వ్యాపారులతో స్వానిధి వెబ్‌సైట్‌లో నమోదు చేయించాలని ఏపీ మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్ ఆదేశించారు. స్వానిధి సే సమద్ధి వారోత్సవాల్లో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో వీధి వ్యాపారులు, ఆర్‌పీ, సీఎంఎంలతో సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వీధి వ్యాపారులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం స్వానిధి అమలు చేస్తుందని, స్వానిధిలో వీధి వ్యాపారులను నమోదు చేయడం ద్వారా వారికి ఎనిమిది రకాల సంక్షేమ పథకాలు అందుతాయని వివరించారు. ఆర్‌పీలు తమ పరిధిలోని వీధి వ్యాపారులకు పథకంపై అవగాహన కల్పించి ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్న వారోత్సవాల్లో నమోదు చేయించాలని కోరారు. వీధి వ్యాపారులు తగిన డాక్యుమెంట్స్‌తో స్వానిధిలో నమోదు కావడం ద్వారా వారికి తొలుత రూ.10 వేలు, సక్రమంగా చెల్లిస్తే తిరిగి రూ.20 వేలు, ఆ తర్వాత రూ.50 వేలు అతి తక్కువ వడ్డీ రేటుకి రుణాలను బ్యాంక్‌లు అందిస్తాయని తెలిపారు. డిజిటల్ పేమెంట్స్ ప్రోత్సహించడం ద్వారా ప్రతి నెల రూ.100 వరకు క్యాష్ బ్యాక్ వస్తుందని వివరించారు. పేదలుగా ఉండే వీధి వ్యాపారులను, వారి కుటుంబ సభ్యులను స్వానిధి వెబ్‌సైట్‌లో నమోదు చేసి వారికి ఆర్థిక భరోసాని కల్పించడానికి మెప్మా సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. జీఎంసీ పరిధిలో వీధి వ్యాపారుల కోసం వెండింగ్ జోన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపితే తగిన తోడ్పాటుని అందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో మెప్మా పీడీ(ఎఫ్ఏసీ) టీవీ విజయలక్ష్మి, జీఎంసీ డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, డెప్యూటీ మేయర్ షేక్ సజిల, ఉపా సెల్ పీఓ బాలాజీ బాషా, సీడీపీఓ కృష్ణవేణి పాల్గొన్నారు.

నర్సింగ్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం



ఎన్నికల అధికారి తులసి బ్రహ్మమ్మతో నర్సింగ్ యూనియన్ నేతలు పద్మజ, సునీత

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఈమేరకు బుధవారం గుంటూరు కో ఆపరేటీవ్ సబ్ డివిజన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.తులసి బ్రహ్మమ్మ జీజీహెచ్‌కు విచ్చేసి ఓటర్ల జాబితాను విడుదల చేశారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారు, ఓట్లు వేయాలనుకునే వారు ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేవో సరిచూసుకోవాలని ఎన్నికల అధికారి కోరారు. జీజీహెచ్‌లో ఈనెల 23న జిల్లా నర్సుల సంఘం ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల్లో పోటీ చేసేవారు ఈనెల 14న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తామని, దాని ప్రకారం పోటీ దారులు నామినేషన్లు దాఖలు చేయాలని ఎన్నికల అధికారి తెలిపారు. 16న నామినేషన్లు స్వీకరణ, 17న నామినేషన్లు పరిశీలన, 18న నామినేషన్‌ల ఉపసంహరణ ఉంటుందని వెల్లడించారు. ఎన్నికల అధికారితోపాటు, నర్సింగ్ యూనియన్ నేతలు వెలంపల్లి పద్మజ, సునీత, ఇతరులు ఓటర్ల జాబితాను ప్రదర్శించి నర్సింగ్ సిబ్బంది అంతా ఓటర్ల జాబితాను సరిచూసుకుని ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. గుంటూరు జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట, గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో నర్సింగ్ యూనియన్ ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

ఘనంగా అక్షరాభ్యాస వేడుకలు



సరస్వతీ కమిటీ స్కూల్లో అక్షరాభ్యాస కార్యక్రమంలో చిన్నారులతో హెచ్ఎం విజయలక్ష్మి

గుంటూరు ఎడ్యుకేషన్: సీతారామ్‌నగర్‌లోని శ్రీసరస్వతీ కమిటీ స్కూల్లో బుధవారం దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పాఠశాలలోని శ్రీసరస్వతీదేవి విగ్రహానికి విశేష అలంకారాలు చేశారు. మూలా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు చిన్నారులకు అక్షరాభ్యాసం, విద్యార్థులతో సరస్వతీ పూజ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన తల్లిదండ్రులు చిన్నారులకు అక్షరాభ్యాసాన్ని చేయించారు. అక్షరాభ్యాసం చేయించుకున్న చిన్నారులకు పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పలకలు, పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు మానసవీణ, జయరాము, నాగమేరీ, సంగీత పాల్గొన్నారు.

విజ్ఞాన్ నిరులలో దసరా నవరాత్రి ఉత్సవాలు



సరస్వతీదేవికి నమస్కరిస్తున్న విజ్ఞాన్ రత్తయ్య

గుంటూరు రూరల్: పలకలూరు రోడ్డులోనిన విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో దసరా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం దేవీ నవరాత్రి కార్యక్రమాలకు విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అభీష్ట దాయిని, శక్తి స్వరూపిణి దుర్గాదేవి అని తెలిపారు. కళాశాల విద్యార్థినులకు బతుకమ్మ, దసరా వేష ధారణ, దాండియా, సాంప్రదాయ వస్త్ర ధారణ తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక తెలిపారు.

విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ

గుంటూరు రూరల్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని నల్లపాడులోని శ్రీఅగస్త్యేశ్వర ఆలయంలో ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం గ్రామంలోని విద్యార్థులకు భక్తులు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. 150 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

అలరించిన గజల్ శ్రీనివాస్ సంగీత విభావరి



గుంటూరు రూరల్: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గోరంట్లలోని శ్రీవేంకటేశ్వరాలయంలో దేవిశరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం కార్యక్రమంలో భాగంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. బతుకమ్మ సంబరాలు చేశారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సినీ గాయకుడు గజల్ శ్రీనివాస్ సంగీత విభావరి భక్తులను అలరించింది. అలనాటి గీతాలతో అమ్మవారి భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు యర్రంశెట్టి వేణుగోపాల్, చైర్మన్ కంచర్ల ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు ఆళ్ళ శివారెడ్డి, గజవల్లి శివన్నారాయణ, దేవరశెట్టి సురేష్, ఓబులుశెట్టి వెంకటనారాయణ, కూనిశెట్టి శ్రీనివాసరావు, పూసల శివయ్య తదితరులు గజల్ శ్రీనివాస్‌ను ప్రత్యేకంగా సన్మానించారు.

సరస్వతీ నమస్తుభ్యం



కొత్తపేట కోదండరామస్వామి దేవస్థానంలో అమ్మవారు సరస్వతీదేవిగా అలంకారం



సంగడిగుంట రెడ్లబజార్ శ్రీకనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు..



లాలాపేట వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారిని శ్రీవిద్యాలక్ష్మీదేవిగా..



కొత్తపేట జగన్నాథస్వామి దేవస్థానంలో అమ్మవారిని శ్రీవిద్యాలక్ష్మీదేవిగా..



ఆర్ అగ్రహారం శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారికి సరస్వతిదేవీ అలంకారం



కొరిటిపాడు శ్రీకోదండ రామాలయంలో సరస్వతీదేవిగా..